




తెలుగు జాతీయ దినపత్రిక

# అక్షర విజేత

నిజం నిర్భయం నిష్పక్షం

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక








ఆంధ్రప్రదేశ్ సంపుటి:05 సంచిక :123 ఎడిటర్ : బి. అనిల్ కుమార్ పేజిలు : 10, వెల. 6రూ/ శనివారం 28 ఫిబ్రవరి 2026




## ఏపీ సీఎం చంద్రబాబుతో తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి భేటీ..

**కుమారుడి వివాహానికి ప్రత్యేక ఆహ్వానం**

- క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వక సమావేశం
- మార్చి 5న హైదరాబాద్‌లో జరగనున్న వివాహ వేడుక

2

## ఏపీ నూతన సీఎస్‌గా సాయిప్రసాద్..

- కొత్త సీఎస్‌గా బాధ్యతలు స్వీకరించనున్న సాయిప్రసాద్
- సాయిప్రసాద్ 1991 బ్యాచ్ ఐఏఎస్ అధికారి



2

## దమ్ముంటే ఇప్పుడు ఎన్నికలు నిర్వహించండి...


**మోదీకి సవాల్ విసిరిన కేజ్రీవాల్**

- లిక్కర్ కేసులో క్లీన్‌చిట్ తర్వాత కేజ్రీవాల్ తొలి ప్రెస్ మీట్
- ఆప్‌ను నాశనం చేసేందుకు మోదీ, షా కుట్ర పన్నారని ఆరోపణ
- దమ్ముంటే ఢిల్లీలో ఎన్నికలు నిర్వహించాలని కేంద్రానికి సవాల్
- తప్పుడు కేసు పెట్టినందుకు ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్
- ఈడీ కేసును కూడా ఉన్నత న్యాయస్థానంలో సవాల్ చేస్తామని వెల్లడి



2

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో క్లీన్‌చిట్ లభించిన అనంతరం ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్.. బీజేపీ, ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)ని నాశనం చేసేందుకే కుట్ర పన్నారని ఆరోపించారు. దమ్ముంటే ఢిల్లీలో వెంటనే అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించి, ప్రజాభిప్రాయం తెలుసుకోవాలని కేంద్రానికి సవాల్ విసిరారు.




- దేశంలోనే తొలి ఎలక్ట్రికల్ స్టీల్ ప్లాంట్
- ఏపీకి రానున్న దేశంలోనే తొలి అమోర్ఫోస్ ఎలక్ట్రికల్ స్టీల్ ప్లాంట్
- తిరుపతి జిల్లా శ్రీసిటీలో రూ.1350 కోట్ల పెట్టుబడి
- అమెరికా-జపాన్ సంయుక్త సంస్థ ప్రొటీరియల్ ఆధ్వర్యంలో ఏర్పాటు
- 2026 అక్టోబర్ నాటికి ఉత్పత్తి ప్రారంభం లక్ష్యం
- ఈ ప్రాజెక్టుతో సుమారు 200 మందికి ప్రత్యక్ష ఉపాధి

## ఏపీకి మరో భారీ పరిశ్రమ..

2

ఏపీ పారిశ్రామిక ప్రగతిలో మరో కీలక ముందడుగు పడింది. దేశంలోనే మొట్టమొదటి అమోర్ఫస్ ఎలక్ట్రికల్ స్టీల్ ప్లాంట్‌ను ఏపీలో ఏర్పాటు చేయనున్నారు. అమెరికా-జపాన్ దేశాలకు చెందిన ప్రొటీరియల్ అనే సంయుక్త సంస్థ ఈ ప్రాజెక్టును తిరుపతి జిల్లాలోని శ్రీసిటీలో స్థాపించనుంది. రూ.1350 కోట్ల భారీ పెట్టుబడితో 'మెట్‌గ్లాస్ ఇండియా' పేరుతో ఈ ప్లాంట్‌ను నిర్మించనున్నట్లు కంపెనీ ప్రకటించింది. ఈ స్టీల్ ప్లాంట్‌ను ప్రొటీరియల్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో అభివృద్ధి చేయనున్నారు. ఇక్కడ అత్యాధునిక జపాన్ టెక్నాలజీని ఉపయోగించి అల్లాయ్ రిబ్బన్‌ను ఉత్పత్తి చేస్తారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా సుమారు 200 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. తొలిదశలో ఏటా 30 వేల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్‌ను ప్రారంభించనున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం 2026 అక్టోబర్ నాటికి పూర్తి చేసి, కార్యకలాపాలు ప్రారంభిస్తామని ప్రొటీరియల్ సంస్థ సీఈవో శాన్‌స్టాక్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక విధానాలు, అందిస్తున్న ప్రోత్సాహకాల వల్లే తాము ఇక్కడ పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఈ స్టీల్ ప్లాంట్ రాకతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని భావిస్తున్నారు.

## నా ఆరోగ్యం గురించి ఆందోళన వద్దు:

**-బొత్స సత్యనారాయణ**

- బొత్సకు బ్రెయిన్ స్ట్రోక్ అంటూ ప్రచారం
- తాను ఆరోగ్యంగా ఉన్నానన్న బొత్స
- రొటీన్ చెకప్ కోసం ఆసుపత్రికి వచ్చానని వెల్లడి



2

తాను ఆరోగ్యంగానే ఉన్నానని వైసీపీ సీనియర్ నేత, శాసనమండలిలో విపక్ష నేత బొత్స నారాయణ తెలిపారు. తన ఆరోగ్యం గురించి ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. రొటీన్ హెల్త్ చెకప్ లో భాగంగానే తాను ఆసుపత్రికి వచ్చానని వెల్లడించారు. ఈ మేరకు ఆయన వివరణ ఇచ్చారు. బొత్సకు బ్రెయిన్ స్ట్రోక్ అంటూ విస్తృతంగా జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో ఆయన క్లారిటీ ఇచ్చారు. అటు, బొత్స కుటుంబ సభ్యులు కూడా ఈ ప్రచారాన్ని ఖండించారు.

## ఈ ఏడాది చివరికి 10 లక్షల పైగా గృహ ప్రవేశాలు జరిపిస్తాం:

**అసెంబ్లీలో సీఎం చంద్రబాబు ప్రకటన**

- ఈ ఏడాది డిసెంబర్ నాటికి 10 లక్షల ఇళ్లు లబ్ధిదారులకు అందజేత
- నిరుపేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్ల స్థలం ఉచితం
- రైతు సంక్షేమమే లక్ష్యంగా వ్యవసాయాభివృద్ధికి ఐదు సూత్రాల అమలు
- లక్ష కోట్లతో రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు ప్రణాళికలు
- ఏలూరులో ప్రపంచంలోనే అతిపెద్ద కోకో సిటీ ఏర్పాటు


రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి సొంతింటి కలను నిజం చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఈ దిశగా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. నేడు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా గృహ నిర్మాణం, వ్యవసాయ శాఖల పద్దులపై జరిగిన చర్చలో సీఎం ప్రసంగించారు. ఈ ఏడాది చివరి నాటికి రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 10 లక్షలకు పైగా ఇళ్లకు గృహ ప్రవేశాలు జరిపిస్తామని ఆయన సభలో ప్రకటించారు. ఇప్పటికీ ఇళ్లు లేని నిరుపేదలు ఎవరైనా ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

2



## ఏపీలో పాలు, నీళ్లు కూడా ప్రాణాంకతమే: జగన్

- చంద్రబాబు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే వరుస మరణాలని జగన్ ఆరోపణ
- శ్రీకాకుళం, రాజమండ్రి ఘటనలతో డజనుకు పైగా ? మృతి చెందారని వెల్లడి
- గత 14 నెలల్లో 900 మందికి పైగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని ఆవేదన
- ప్రభుత్వం వెంటనే మేల్కొని చర్యలు చేపట్టాలని డిమాండ్



2

ఆంధ్రప్రదేశ్‌లో ప్రజారోగ్య వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోయిందని, చంద్రబాబు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా తాగే నీరు, పాలు కూడా ప్రజల పాలిట ప్రాణాంతకంగా మారాయని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో వరుసగా చోటుచేసుకుంటున్న డయేరియా, కల్తీ పాల మరణాలు ప్రభుత్వ వైఫల్యానికి నిలువుటద్దమని ఆయన విమర్శించారు.

## వైవీ సుబ్బారెడ్డి భారీగా సంపాదించారు

**-: బాలినేని శ్రీనివాసరెడ్డి**

- లడ్డూ వ్యవహారంలో సుబ్బారెడ్డి ఎంత సంపాదించారో తనకు తెలియదన్న బాలినేని
- సుబ్బారెడ్డిని అరెస్ట్ చేస్తే ఎక్కువ సంతోషించే వ్యక్తి తానేనని వ్యాఖ్య
- తన కుమారుడిని వివాదాల్లోకి లాగుతున్నారని ఆవేదన

టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డిపై మాజీ మంత్రి, జనసేన నేత బాలినేని శ్రీనివాసరెడ్డి సంచలన వ్యాఖ్యలుచేశారు. తిరుమల లడ్డూ వ్యవహారంలో వైవీ సుబ్బారెడ్డి ఎంత సంపాదించారో తనకు తెలియదు కానీ, ఇతర అంశాల్లో మాత్రం భారీగా వెనకేశారని బాలినేని ఆరోపించారు. వైవీ సుబ్బారెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసి జైల్లో వేస్తే, అందరికంటే ఎక్కువగా సంతోషించే మొదటి వ్యక్తిని తానే అని అన్నారు.తనపై వచ్చిన ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరినట్లు వెల్లడించారు. తన రాజకీయ ప్రత్యర్థులు తన కుమారుడిని వివాదాల్లోకి లాగుతూ తనను మానసిక క్షోభకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఒంగోలులో రెండుసార్లు ఓడిపోవడానికి కూటమి బలంగా ఉండటమే కారణమని విశ్లేషించారు. గత ప్రభుత్వ హయాంలో డ్వాక్రా మహిళల నగదును కాజేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాలినేని డిమాండ్ చేశారు. ఆ నిధులు కాజేసిన వైసీపీ నేతల పేర్లను బయటపెట్టి, వారిపై విచారణ జరిపించాలని కోరారు.



# దమ్ముంటే ఇప్పుడు ఎన్నికలు నిర్వహించండి...

మనీష్ సిసోడియా, సంజయ్ సింగ్ వంటి సీనియర్ నేతలతో కలిసి పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తప్పుడు కేసులో తనను, ఆప్ నేతలను ఇరికించినందుకు మోదీ, షా ద్వయం ఢిల్లీ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదొక తప్పుడు, కల్పిత, పూర్తిగా నిరాధారమైన కేసని, అందుకే న్యాయవిచారణలో నిలవలేకపోయిందని అన్నారు. ఈ కేసులో విచారణ ప్రారంభించడానికి తగిన ఆధారాలు లేవని రౌస్ అవెన్యూ కోర్టు 600 పేజీల తీర్పులో స్పష్టం చేసిందని కేజ్రీవాల్ గుర్తుచేశారు. సీబీఐ కేసును కోర్టు కొట్టేసిన నేపథ్యంలో, ఈడీ కేసు కూడా నిలబడదని, త్వరలోనే దానిని ఉన్నత న్యాయస్థానంలో సవాల్ చేస్తామని తెలిపారు. ఈ తీర్పుతో తాను, మనీష్ సిసోడియా, సంజయ్ సింగ్ వంటి ఆప్ నేతలు 'కట్టర్ ఇమాన్‌దార్' (అత్యంత నిజాయతీపరులు) అని మరోసారి రుజువైందని అన్నారు. "ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాలే ఈ కుట్రకు సూత్రధారులు. మమ్మల్ని అధికారం నుంచి దించేందుకే నాలుగేళ్లుగా సీబీఐ, ఈడీ వంటి ఏజెన్సీలను వాడుకుని వేధించారు" అని కేజ్రీవాల్ ఆరోపించారు. ఇప్పుడు ఎన్నికలు పెడితే, బీజేపీకి 10 సీట్లు కూడా రావని జోస్యం చెప్పారు. రాహుల్ గాంధీ, రాబర్ట్ వాద్రాలపై కేసులు ఉన్నా ఎందుకు జైలుకు వెళ్లడం లేదని, కాంగ్రెస్ ఆరోపణలపై అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు

# ఈ ఏడాది చివరికి 10 లక్షల పైగా గృహ ప్రవేశాలు జరిపిస్తాం:

2029 నాటికి అందరికీ ఇళ్లు

రాష్ట్రంలో ఏ ఒక్క పేద కుటుంబం కూడా ఇల్లు లేకుండా ఉండకూడదన్నదే తమ ధ్యేయమని సీఎం తెలిపారు. రాయచోటి నుంచి ఇప్పటికే 3 లక్షల ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించామని, ఈ ఏడాది ఉగాది నాటికి దాదాపు 3 లక్షల ఇళ్లలో లబ్ధిదారులు చేరేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జూన్ నాటికి మరో 2.26 లక్షలు, సెప్టెంబర్ నాటికి ఇంకో 2.10 లక్షల ఇళ్లకు గృహ ప్రవేశాలు పూర్తి చేస్తామని స్పష్టమైన ప్రణాళికను వివరించారు.

2029 నాటికి రాష్ట్రంలోని పేదలందరికీ పక్కా ఇళ్లు కట్టించడంతో పాటు, అర్హులైన వారికి ఉచితంగా ఇంటి స్థలాలు కూడా పంపిణీ చేస్తామని భరోసా ఇచ్చారు. పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల చొప్పున స్థలాన్ని కేటాయించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 2.20 లక్షల కుటుంబాలకు సొంత జాగా లేదని గుర్తించామన్నారు.

అక్రమార్కులపై ఉక్కుపాదం

గత ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణ రంగం, ఇసుక విధానాల్లో జరిగిన అవినీతిపై సీఎం చంద్రబాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పేదల ఇళ్ల పేరుతో గత పాలకులు భారీగా అక్రమాలకు పాల్పడ్డారని, ఇసుక విధానాన్ని అస్తవ్యస్తం చేసి దోచుకున్నారని ఆరోపించారు. ఈ కుంభకోణాల్లో భాగస్వాములైన ప్రతి ఒక్కరిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, త్వరలోనే దీనికి సంబంధించిన కార్యాచరణను ప్రకటిస్తామని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అందరికీ ఇళ్లు ఇచ్చే బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తాయని తెలిపారు.

వ్యవసాయానికి 'పంచ సూత్రాల' ఊతం

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయిన వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం 'పంచ సూత్రాల' విధానాన్ని అమలు చేస్తోందని ముఖ్యమంత్రి వివరించారు. అగ్రిటెక్, నీటి భద్రత, డిమాండ్ ఉన్న పంటల సాగు, ఫుడ్ ప్రాసెసింగ్, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడం ద్వారా రైతులను ఆదుకుంటామని చెప్పారు. వ్యవసాయంలో యాంత్రీకరణతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సేవలను కూడా రైతులకు అందుబాటులోకి తెస్తామన్నారు.

రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏటా రూ.20,000 ఆర్థిక సాయాన్ని అందిస్తున్నామని సీఎం గుర్తుచేశారు. ఇందులో రాష్ట్ర వాటాగా రూ.14,000, కేంద్రం వాటాగా రూ.6,000 కలుపుకుని పంపిణీ చేస్తున్నామన్నారు. ఇప్పటికే 47 లక్షల మంది రైతులకు రెండు విడతల్లో రూ.6,309 కోట్లు జమ చేశామని, గత ప్రభుత్వం బకాయి పెట్టిన రూ.1,670 కోట్లు కూడా తామే చెల్లించామని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని, ఇప్పటివరకు రూ.10,816 కోట్లు చెల్లించామని వివరించారు. ఉచిత విద్యుత్ కోసం 2025-26 బడ్జెట్‌లో రూ.13,722 కోట్లు కేటాయించామని, ఈ ఏడాది కొత్తగా 69 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేశామని చెప్పారు.

రాయలసీమ ఇక ఉద్యాన హబ్

రాష్ట్రంలో ఉద్యానవన, ఆక్వా రంగాల అభివృద్ధికి భారీ ప్రణాళికలు రూపొందించామని చంద్రబాబు తెలిపారు. రాయలసీమను 'హార్టికల్చర్ హబ్'గా తీర్చిదిద్దేందుకు రూ.30 వేల కోట్లతో క్లస్టర్ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ప్రైవేటు పెట్టుబడులతో కలిపి మొత్తం రూ.1 లక్ష కోట్లతో సీమ రూపురేఖలు మారుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం 400 మిలియన్ మెట్రిక్ టన్నులుగా ఉన్న ఉత్పత్తులను 1000 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెంచడమే లక్ష్యమన్నారు. అలాగే, ఏలూరులో ప్రపంచంలోనే అతిపెద్ద 'కోకో సిటీ'ని ఏర్పాటు చేయబోతున్నట్లు సీఎం సంచలన ప్రకటన చేశారు.

నీటి భద్రతపై తీసుకున్న చర్యల వల్ల అన్నమయ్య జిల్లాలో భూగర్భ జలాలు 6.67 మీటర్ల మేర పెరిగాయని, రాష్ట్ర సగటున 7.31 మీటర్ల మేర భూగర్భ జలాలు ఉన్నాయని సంతోషం వ్యక్తం చేశారు. దీనివల్ల రూ.95 కోట్ల విలువైన విద్యుత్ ఆదా అయ్యిందని చెప్పారు. కౌలు రైతులకు కూడా ప్రభుత్వం అండగా ఉంటుందని, సాగునీటి సంఘాలను బలోపేతం చేసి రైతన్నకు భరోసా కల్పిస్తామని సీఎం చంద్రబాబు తన ప్రసంగంలో స్పష్టం చేశారు.

# విద్యార్థి జీవితంలో విద్య ఎంతో కీలకం.

**-- విద్యార్థులు ఎన్నుకున్న లక్ష్యాలను పూర్తి చేయాలి. -- సినీ నటులు, రచయిత తనికెళ్ల భరణి.**








ఆలమూరు, : ప్రతి విద్యార్థి జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించేందుకు విద్యాభ్యాస సమయంలో లక్ష్యసాధన దిశగా క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని ప్రముఖ సినీ నటులు రచయిత తనికెళ్ల భరణి విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఆలమూరు మండలం చెముడులంక శ్రీ సత్య విద్యానికేతన్ 25వ వార్షికోత్సవ వేడుకలు సందర్భంగా శుక్రవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన విచ్చేశారు. తనికెళ్ళ విద్యార్థులతో ముచ్చటిస్తూ విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యాసాధనలో పరిపూర్ణత చెంది ఉన్నత స్థానాలను అధిరోహించేందుకు విద్య ఎంతో కీలకమని ఆ దిశగా విద్యార్థులు క్రమశిక్షణతో విద్యాభ్యాసాన్ని పూర్తిచేయాలన్నారు. పచ్చటి పంట పొలాల మధ్య ఎంతో ఆహ్లాదకరంగా ఉన్న ఈ పాఠశాలలో విద్యార్థులు విద్యను అభ్యసిస్తూ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. సెల్ ఫోన్లు, సోషల్ మీడియాలకు విద్యార్థులను దూరంగా ఉంచేందుకు తల్లిదండ్రులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. విద్యార్థి ఏ రంగంలో రాణించాలన్నా మంచి నైపుణ్యత అవసరమన్నారు. పదిమందితో మాట్లాడటం, కమ్యూనికేషన్స్ స్కిల్స్ పెంపొందించుకోవడం, సబ్జెక్టు మీద అవగాహన పెంచుకోవడం అనేవి విద్యార్థి దశలో తప్పనిసరి అన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి సమాజాభివృద్ధికి తమ వంతు తోడ్పాటు అందించాలని సూచించారు. ప్రస్తుతం విద్యార్థి దశలోనే పోటీతత్వం పెరిగిందని ఆ దిశగా డిజిటల్ ఎడ్యుకేషన్ విధానంతో పాటు కంప్యూటర్ నాలెడ్జ్ కూడా నైపుణ్యతను సాధించాలన్నారు. ఈ పాఠశాలను ఇంత చక్కటి వాతావరణంలో నిర్వహిస్తున్న స్కూల్ కరస్పాండెంట్ విజయకుమార్, ముఖ్య సలహాదారులు జేజే పుత్ర కుమార్, ఉపాద్యాయులను ఆయన అభినందించారు. అలాగే పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు తనికెళ్ల భరణితో పాటు మరో ముఖ్య అతిథి రావులపాలెం విక్టరీ సంస్థల అధినేత గొలుగూరి వెంకటరెడ్డి చేతులమీదుగా ప్రశంస పత్రాలు, జ్ఞాపకలను అందజేశారు. అలాగే ఈ స్కూల్ వ్యవస్థాపకులు సత్యనారాయణ, సత్యవతి దంపతుల షష్టిపూర్తి కార్యక్రమం ముఖ్య అథిదుల సమక్షంలో జరిగింది. అనంతరం తనికెళ్ళ భరణిని శాలువా, జ్ఞాపికలతో పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు

# ఏపీ నూతన సీఎస్‌గా సాయిప్రసాద్..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా సీనియర్ ఐఏఎస్ అధికారి జి. సాయిప్రసాద్ బాధ్యతలు చేపట్టబోతున్నారు. ప్రస్తుత చీఫ్ సెక్రటరీ కె. విజయానంద్ పదవీ కాలం రేపటితో (ఫిబ్రవరి 28) ముగియనుంది. ఈ నేపథ్యంలో, విజయానంద్ స్థానంలో సాయిప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఇప్పటికే అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. రేపు ఉదయం సచివాలయంలో కొత్త సీఎస్‌గా సాయిప్రసాద్ బాధ్యతలను స్వీకరిస్తారు. 1991 బ్యాచ్ ఏపీ క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి జి. సాయిప్రసాద్ 'ఎంటెక్' చదివారు. సివిల్ సర్వీసులోకి ప్రవేశించి 1992లో వరంగల్ అసిస్టెంట్ కలెక్టర్‌గా తన వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. 1993-95 మధ్య పాడేరు అసిస్టెంట్ కలెక్టర్‌గా గిరిజన ప్రాంతాల్లో సేవలందించారు. 1995 నుంచి 1997 వరకు గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా... 1997-98 మధ్య కాలంలో కడప జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. 2000 నుంచి 2003 వరకు కర్నూలు జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. సాయి ప్రసాద్ విద్యుత్ రంగం, గృహనిర్మాణ రంగాల్లో కూడా కీలక బాధ్యతలు నిర్వహించారు. ఏపీ ట్రాన్స్‌కో జాయింట్ ఎండీ, ఈపీడీసీఎల్ సీఎండీ, ఏపీ సీపీడీసీఎల్ సీఎండీ, ఏపీ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్‌గా సేవలందించారు. 2011 నుంచి 2014 వరకు కేంద్ర ప్రభుత్వ ఇంధన శాఖలో సంయుక్త కార్యదర్శిగా కూడా పనిచేశారు. సాయిప్రసాద్ 2014 నుంచి 2019 వరకు ముఖ్యమంత్రి కార్యాలయంలో కార్యదర్శిగా, ముఖ్య కార్యదర్శిగా పనిచేశారు. ఆ తర్వాత సోలార్ పవర్ కార్పొరేషన్ సీఎండీగా, ఇంధన శాఖ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2024 నుంచి జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతూ ఇప్పుడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించబోతున్నారు.

# ఏపీ సీఎం చంద్రబాబుతో తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి భేటీ..

ఏపీ సీఎం చంద్రబాబును తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. తన కుమారుడి వివాహానికి హాజరు కావాలని చంద్రబాబును భట్టి విక్రమార్క ప్రత్యేకంగా ఆహ్వానించారు. భట్టి విక్రమార్క కుమారుడు సూర్యవిక్రమాదిత్య వివాహం మార్చి 5వ తేదీన హైదరాబాద్‌లో జరగనుంది. ఈ వేడుకకు సంబంధించిన ఆహ్వాన పత్రికను డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి శ్రీధర్ బాబు కలిసి చంద్రబాబుకు అందజేశారు. ఈ సందర్భంగా ఇరు రాష్ట్రాల నేతలు కాసేపు ముచ్చటించుకున్నారు. ఈ సమావేశం పూర్తిగా మర్యాదపూర్వకంగానే జరిగిందని, ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేదని స్పష్టమవుతోంది. తన కుమారుడి వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించాలని చంద్రబాబును భట్టి విక్రమార్క కోరారు.

# ఏపీలో పాలు, నీళ్లు కూడా ప్రాణాంకతమే: జగన్

పరిపాలనపై పట్టుకోల్పోయిన పాలకులు, ప్రతిపక్షంపై బురద చల్లడం, కక్ష సాధింపులపైనే దృష్టి పెట్టారని, ప్రజల ప్రాణాలను గాలికొదిలేశారని జగన్ ఆరోపించారు. గత వారంలోనే శ్రీకాకుళంలో కలుషిత నీటి కారణంగా డయేరియా ప్రబలి ఐదుగురు మరణించగా, 200 మందికి పైగా ఆసుపత్రి పాలయ్యారని జగన్ గుర్తుచేశారు. అదే వారంలో రాజమహేంద్రవరంలో కల్తీ పాలు తాగి ఏడుగురు ప్రాణాలు కోల్పోగా, మరో ఎనిమిది మంది వెంటిలేటర్లపై ప్రాణాలతో పోరాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోషణ ఇవ్వాల్సిన పాలు, దాహం తీర్చాల్సిన నీళ్లు ప్రాణాలు తీస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన గత 14 నెలల్లో రాష్ట్రంలోని హాస్టళ్లు, విద్యాసంస్థల్లో సుమారు 25 ఫుడ్ పాయిజన్ ఘటనలు జరిగాయని, వీటి వల్ల 15 జిల్లాల్లో 900 మందికి పైగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని జగన్ వివరించారు. కురుపాం గిరిజన బాలికల పాఠశాలలో తాజాగా 16 మంది విద్యార్థినులు డయేరియాతో అస్వస్థతకు గురయ్యారని, గతంలో ఇదే పాఠశాలలో ఇద్దరు విద్యార్థినులు మరణించినా ప్రభుత్వం పాఠాలు నేర్చుకోలేదని విమర్శించారు. రాష్ట్రంలో నెలకొన్న దారుణ పరిస్థితులను జాతీయ మీడియా సైతం ఎండగడుతోందని తెలిపారు. గడచిన 18 నెలల్లో చేబ్రోలు, విజయవాడ, గుంటూరు, శ్రీకాకుళం వంటి అనేక ప్రాంతాల్లో డయేరియా ప్రబలి వందలాది మంది అస్వస్థతకు గురై, డజన్ల కొద్దీ మరణాలు సంభవించాయని జగన్ ఆరోపించారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపానికి స్పష్టమైన నిదర్శనమన్నారు. ఆహార భద్రత, సురక్షిత నీటి సరఫరా వంటి కనీస బాధ్యతలను కూడా ప్రభుత్వం విస్మరించిందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా నిద్ర మేల్కొని, రాజకీయ ప్రయోజనాలు పక్కనపెట్టి చిత్తశుద్ధితో పరిస్థితిని సమీక్షించాలని జగన్ డిమాండ్ చేశారు. లోపాలను గుర్తించి సరిదిద్దాలని, సురక్షిత నీటి సరఫరా వ్యవస్థను మెరుగుపర్చాలని, ఆహార భద్రత పర్యవేక్షణను కఠినంగా అమలు చేయాలని సూచించారు. ప్రజలు ప్రభుత్వం నుంచి అద్భుతాలు కోరుకోవడం లేదని, మరిన్ని ప్రాణాలు పోకముందే మేల్కొని, తగిన చర్యలు చేపట్టాలని మాత్రమే ఆశిస్తున్నారని జగన్ పేర్కొన్నారు.

# 10వ తరగతి,విద్యార్థిని విద్యార్థులకు పరీక్ష సామాగ్రీ వితరణ

కావలి,

శ్రీసాయి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు,పి.మాధవి ఆధ్వర్యంలో....మనసున్న దాతల సహకారంతోకావలి డివిజన్ సహాయ బిసి సంక్షేమాధికారి వి.అరుణమ్మ అధ్యక్షతన.... ప్రభుత్వబిసి బాలికల హాస్టల్ లోని 45మంది, బిసి బాలుర హాస్టల్ లోని 25మందికి, త్వరలోజరుగబోవు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు సంధర్భముగ,హర్ష ధ్వనులమధ్యన పరీక్షసామాగ్రి అందచేయడంజరిగింది.ముఖ్య అతిధులుగా విచ్చేసిన, విశ్రాంత లెక్చరర్ వీఎ ప్రసాద్ రావు , విశ్రాంత ప్రధానోపాధ్యాయులు,ఎం. అజిత్ బాబు, విశ్రాంత వసతిగృహ సంక్షేమాధికారి,షేక్ బాష విద్యార్థులకు ప్రేరణ,అవగాహన కార్యక్రమంలో భాగంగ, పరీక్షలలో విద్యార్థిని, విద్యార్థులకు,తగు సూచనలు, జాగ్రత్తలు, అవలంభించాల్సిన పద్ధతులుగురించి తెలియచేస్తు, మీరందరుఇష్టపడి, కస్టపడి చదివి భావి భారత పౌరులుగా అన్నిరంగాల్లో రాణించాలని, మీ ఉజ్వల భవిష్యత్ మీచేతుల్లో ఉన్నదని,ఉత్తీర్ణత శాతంను పెంచి,మంచి రాంకులు సాధించాలని, మీతల్లి దండ్రులు,ఉపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమాధికారులకుమంచిలిపేరు ప్రతిష్టలు,తేవాలని ధైర్యం నింపడమైనది, పై కార్యక్రమం లో వసతిగృహ సంక్షేమాధికారులు బి. చలపతిరావు,నాగేశ్వరి,హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు, విద్యార్థినులు, పాల్గొన్నారు.



# మురుగు నీటిలో మంచినీటి కుళాయి ప్రజారోగ్యంతో అధికారుల నిర్లక్ష్య ఆట!

## మురుగులో మునిగిన మంచినీటి కుళాయి వ్యాధులకు ఆహ్వానం పలుకుతున్న పరిస్థితి

## డ్రైనేజ్ లేదుడ మురుగులోనే మంచినీరు దేవరపల్లిలో దారుణ పరిస్థితి





విజేత. దేవరపల్లి :
దేవరపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో పారిశుద్ధ్య వ్యవస్థ దారుణంగా ఉండడంతో మంచినీటి కుళాయి మురుగు నీటిలోనే మునిగిపోయిన పరిస్థితి కనిపిస్తోంది. డ్రైనేజ్ సదుపాయం సరిగా లేకపోవడంతో కుళాయి చుట్టూ మురుగు నీరు నిలిచిపోవడం వల్ల అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
స్థానికులు మంచినీరు కోసం అదే కుళాయి వద్దకు వెళ్లాల్సి వస్తున్నప్పటికీ, చుట్టూ మురుగు నీరు ఉండడం వల్ల ఆ నీటిని ఎలా పట్టుకోవాలి, ఎలా తాగాలి అనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితి వల్ల మంచినీరు కలుషితమై వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
పరిస్థితిని పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు నీటి సమస్యను వెంటనే పరిష్కరించి, ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటి సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అలాగే డ్రైనేజ్ వ్యవస్థను సరిచేసి, మంచినీటి కుళాయి చుట్టూ శుభ్రత చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. లేదంటే ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

## విద్యా ర్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి హెచ్ ఎం చిట్టి బాబు



రామసముద్రం పిబ్రవరి 27 విజేత
అన్నమయ్య జిల్లా ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు జరగబోవు పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తేవాలని ఎం ఈ ఓ 2ఆంజనేయులు, హెచ్ ఎం చిట్టి బాబు సూచించారు. మండలకేంద్రం లోని ప్రభుత్వ జడ్పీ జడ్పీ హైస్కూల్లో వార్షికోత్సవ వేడుకలు హెచ్ ఎం చిట్టిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిధులుగా ఎం ఈ వో 2ఆంజనేయులు,చొక్కాండ్ల పల్లె హెచ్ ఎం శ్రీనివాసులు సందీప్, స్కూల్ వైస్ చైర్మన్ రమణమ్మ లను హెచ్ ఎం చిట్టిబాబు ఉపాధ్యాయులు విద్యార్తులు వీరిని సాధరంగా స్వాగతం పలికారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఈ వేడుకలను ప్రారంభించారు పాఠశాల ఆవరణాన్ని పచ్చని తోరణాలు, పలు రకాల పుష్పాలతో అలంకరణ చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖులు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి మంచి విజయాలు సాధించాలన్నారు. రేపటి భవిష్యత్తు కోసం విద్యార్థులు యొక్క జీవితప్రయాణాన్ని ఎలా ముందుకు తీసుకు పోవాలో ఉపాధ్యాయులు విద్యార్థుల కు దిశానిర్దేశం చేయడం జరిగింది. పదవ తరగతి విద్యార్థులు సమయపాలనతో చదువుతూ మంచి ఉత్తీర్ణత శాతం సాధించాలన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి ఒకవే యంతో చదివి మంచి ఉద్యోగాలతో స్థిరపడి తల్లి దండ్రులకు, విద్యనేర్పిన గురువులకు పేరు ప్రక్యాతలు తీసుకురావాలన్నారు. ఫోన్ ఉన్నది మంచికి వినియోగించుకోవాలని చెడు అలవాట్ల జోలికి వెళ్ళరాదన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.పదవతరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు పూర్వ విద్యా ర్థులు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈపాఠశాల వార్షికోత్సవం లో పాల్గొన్నా ఎం ఈవో 2 ఆంజనేయులు హెచ్ ఎం శ్రీనివాసులు, సందీప్, స్కూల్ వైస్ చైర్మన్ రమణ మ్మ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## దేవరపల్లి భాష్యం స్కూల్లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



విజేత బిదేవరపల్లి :
దేవరపల్లి భాష్యం స్కూల్ నందు యూకేజీ మరియు ఐదవ తరగతి నుండి పై తరగతులకు ప్రమోట్ అవుతున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించి పట్టాలను అందించారు. ఈ సందర్భంగా భాష్యం స్కూల్ ప్రిన్సిపల్ పి పేరయ్య నాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థుల ప్రగతిని గుర్తించి ప్రశంసించడం ద్వారా చదువుపట్ల విద్యార్థులలో మరింత ఆసక్తిని పెంపొందించ వచ్చని,ప్రతి విద్యార్థి ఎవరికి వారే ప్రత్యేకమని వేరొకరితో పోలిక కించపరిచే విధంగా లేకుండా వారి వారి వ్యక్తిగత సమస్యలను సామర్థ్యములను గుర్తించి ప్రోత్సహిస్తే విద్యార్థులు అద్భుతాలు సాధిస్తారని అన్నారు.విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి.ఈ కార్యక్రమంలో భాష్యం ఛాంప్స్ ప్రిన్సిపల్ షేక్ షబానా,వైస్ ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు,సుదీషా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు,విద్యార్థులు పాల్గొన్నారు

## గ్రామీణ ప్రజలందరూ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకోవాలి

### - ఐటీడీఏ పీవో రాములు నాయక్.



విజేత . బుట్టాయగూడెం.
బుట్టాయిగూడెం మండలం దొరమామిడి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ 1352 వ శాఖను ఐటిడిఎ పి వో రాములు నాయక్ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా పీవో రాముల నాయక్ మాట్లాడుతూ దొరమామిడి గ్రామం లోని గ్రామీణ బ్యాంక్ శాఖను ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు. దొరమామిడి పరిసర ప్రాంత ప్రజలు బ్యాంకింగ్ సేవల కొరకు బుట్టాయగూడెం మరియు జంగారెడ్డిగూడెం వంటి సుదూర ప్రాంతాలకు వెళ్ళవలసి వచ్చేదని, ఈ సేవలను పొందేందుకు ఇక్కడ ప్రజలు వ్యయ ప్రయాసలు కూర్చి వెళ్లేవారని వాపోయారు. మహిళలు ఈ సేవలను ఉపయోగించుకొని పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. డ్వాక్రా మహిళలు, చిన్న మరియు సన్నకారు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం పి పి తెల్లం రమణ, సర్పంచ్ తెల్లం రాముడు మరియు బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు

## శ్రీప్రసన్న పార్వతి సమేత చంద్రశేఖరస్వామి బ్రహ్మోత్సవ ఆహ్వానం

రామసముద్రం పిబ్రవరి 27 విజేత
అన్నమయ్య జిల్లా రామసముద్రం మండల కేంద్రంలోని దిగువపేటలో కొలువైన శ్రీ ప్రసన్న పార్వతీ సమేత చంద్రశేఖర స్వామి వారి బ్రహ్మోత్సవాలు స్వస్తిశ్రీ విశ్వావసునామ సంవత్సరం ఫాల్గుణమాసం శుద్ధ ద్వాదశి ఈ నెల 28శనివారం నుంచి పాల్గుణ మాసం బహుళచవితి మార్చి 7 వతేదీ వరకు రథోత్సవాలు వైభవంగా నిర్వహించడం జరుగుతుందని ఆలయ ప్రధాన అర్చకులు బాలా స్వామి తెలియజేశారు. ఆలయ అర్చకులు మాట్లాడుతూ ప్రతిరోజు స్వామి వారికి అభిషేకాలు,ధ్వజా రోహణం, కళ్యానోత్సవం, మార్చి 3న రథోత్సవం ప్రధాన ఆకర్షణలని అనంతరం స్వామివారికి వసంతోత్సవం, గ్రామోత్సవం నిర్వహించి శయనోత్సవంతో స్వామి వారి బ్రహ్మోత్సవాలు ముగింపు అవుతుందని కావున ప్రతి ఒక్కరూ విచ్చేసి స్వామిని దర్శించి తరించవలసిందిగా కోరుకుంటున్న. ఆలయం వద్ద ప్రతి రోజు రాత్రి అన్న దానం నిర్వహించడం జరుగుతుందని అర్చకులు తెలిపారు.







## జనసేన సభ్యత్వ నమోదు మహోత్సవం

విజేత గణపవరం
చిలకలూరిపేట నియోజకవర్గంలోని గణపవరం గ్రామం ఒక రాజకీయ చైతన్యానికి వేదికైంది. స్థానిక మండలనేని ఫంక్షన్ హాల్ నందు జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజా రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణుల నుండి విశేష స్పందన లభించింది. ముఖ్య అతిథుల సందేశం – పార్టీ బలోపేతంఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, విశిష్ట అతిథిగా ఉమ్మడి గుంటూరు జిల్లా ఇంచార్జ్ గాదె వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జనసేన పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో క్రియాశీలక సభ్యత్వం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. సభ్యత్వం పొందిన ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని, క్రమశిక్షణతో కూడిన రాజకీయాలే జనసేన బలం అని వారు స్పష్టం చేశారు.
మండలనేని చరణ్ తేజ చొరవ – కార్యకర్తల ఉత్సాహం
ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో మండలనేని చరణ్ తేజ కీలక పాత్ర పోషించారు. తెర వెనుక ఉండి కార్యక్రమ రూపకల్పన చేయడమే కాకుండా, కార్యకర్తలను సమన్వయపరుస్తూ వారిలో నూతన ఉత్తేజాన్ని నింపారు. చరణ్ తేజ నాయకత్వంలో కార్యకర్తలు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంపై అతిథులు ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించారు. సత్కారాలు కార్యక్రమం అనంతరం పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న నాయకులను ఘనంగా గౌరవించుకున్నారు. రాష్ట్ర కో-కన్వీనర్ పెంట్యాల బాలాజీ, నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజా రమేష్, మరియు మండలనేని చరణ్ తేజలను శాలువాతో సత్కరించి, వారి సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో

## ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ వైభవాన్ని కాపాడుకోవాలి::గణబాబు



విజేత విశాఖ బ్యూరో::ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఉన్న చారిత్రక ప్రాముఖ్యతను కాపాడుకుంటూ, దాని పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం విప్ మరియు విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు)అసెంబ్లీ వేదికగా విజ్ఞప్తి చేశారు,శుక్రవారం ఆయన అసెంబ్లీ లో మాట్లాడుతూ చారిత్రక వారసత్వం ,వందేళ్ల ఘన చరిత్ర కలిగిన ఏయూ ప్రాముఖ్యతను కాపాడాలని సి.వి. రామన్, సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి మహానుభావుల వారసత్వాన్ని స్ఫూర్తిగా తీసుకుని, యూనివర్సిటీని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలన్నారు, గత ప్రభుత్వ హయాంలో యూనివర్శిటీ రాజకీయ అడ్డాగా మారిందని, దీనివల్ల విద్యాసంస్థ ప్రతిష్ట దెబ్బతిన్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు,యూనివర్శిటీలో రాజకీయ జోక్యం లేకుండా చేసి, విద్యా ప్రమాణాలను పునరుద్ధరించాలని కోరారు,గత 18 ఏళ్లుగా కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న 93 మందిని వెంటనే రెగ్యులరైజ్ చేయాలని గణబాబు కోరారు,వీరిలో చాలామంది పదవీ విరమణకు దగ్గరగా ఉన్నందున, వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు, అలాగే సుమారు 400 నుండి 500 మంది గెస్ట్ ఫ్యాకల్టీ కేవలం రూ. 15,000 తక్కువ వేతనంతో పనిచేస్తున్నారని తెలిపారు,వారి ఆర్థిక ఇబ్బందులను గమనించి, సానుకూల నిర్ణయం తీసుకోవాలని అసెంబ్లీ వేదికగా విజ్ఞప్తి చేసారు,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవ తీసుకుని, ఏయూ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కోరారు,యూనివర్శిటీ అభివృద్ధికి, సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

## నేటి నుంచి విశాఖలో రెండు రోజుల పాటు టాలీవుడ్ సెలబ్రిటీ క్రికెట్ పండుగ

విజేత విశాఖ బ్యూరో::మధురవాడ ఏసీఏ – వీడీసీఏ స్టేడియంలో ఈరోజు రేపు టాలీవుడ్ సెలబ్రిటీ క్రికెట్ లీగ్ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రముఖ సినీ హీరోలు శ్రీకాంత్, తరుణ్ తెలిపారు,హోటల్ డాల్ఫిన్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మిగతా హీరోలు సుధీర్ బాబు, ఓంకారం, అశ్విన్ బాబు, అయ్యప్ప శర్మ, ప్రిన్స్, ఖయ్యూం, ప్రభు, ఈటీవీ ప్రభాకర్, నిఖిల్, సామ్రాట్, నందకిషోర్ నందకిషోర్, పవన్ సాయి, సాంబతో కలిసి క్రికెట్ పోటీల వివరాలను వెల్లడించారు,టాలీవుడ్ నటులు, టీవీ నటులతో రెండేసి టీంలు.. పోలీసులు, బ్యూరోక్రాట్లు, రాజకీయ నాయకులతో ఒక్కో టీం చొప్పున మొత్తం 7 టీంల నుంచి 110 సెలబ్రిటీలు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు, ఈ మ్యాచ్ ల ద్వారా వచ్చే ఆదాయాన్ని పేద పిల్లల చదువు, సీఎం సహాయ నిధి, దాతృత్వ కార్యక్రమాలకు వినియోగిస్తారని పేర్కొన్నారు, విశాఖను అంతర్జాతీయ స్పోర్ట్స్ హబ్ గా ప్రభుత్వం తీర్చిదిద్దుతోందన్నారు,రెండు రోజుల పాటు అలరించనున్న సెలబ్రిటీ లీగ్ ను వీక్షించే అవకాశాన్ని విశాఖ ప్రజలు ఉచితంగా తిలకించే వినియోగించుకోవాలని కోరారు,సెలబ్రిటీ లీగ్ నిర్వాహకుడు రాంబాబు మాట్లాడుతూ క్రికెట్ పోటీల నిర్వహణలో వెన్నంటి ఉండి నడిపిస్తున్న ఎమ్మెల్యే గంటా సూచనతో ఉచిత ప్రవేశం కల్పించాలని నిర్ణయించామని తెలియజేశారు,ఐపీఎల్ తరహాలో సెలబ్రిటీ మ్యాచ్ లను డిజైన్ చేశామన్నారు,టాలీవుడ్ సెలబ్రిటీ క్రికెట్ లీగ్ పోస్టర్ ను ఈ సందర్భంగా విడుదల చేశారు, సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ, నగర పోలీస్ కమిషనర్, జీవీఎంసీ కమిషనర్ ఎంతగానో సహకరిస్తున్నారని తెలిపారు ,మొదటిరోజు మూడు టీములు, తలపడతాయని అన్నారు



# ఆదివాసీ చట్టాల అమలులో ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు

**- మాజీ ఎంపీ డా. మిడియం బాబురావు**





విజేత . బుట్టాయగూడెం.
ఆదివాసీలకు రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులు, పార్లమెంట్ ఆమోదించిన చట్టాలు ఉన్నప్పటికీ వాటి అమలులో ప్రభుత్వం ఘోర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ డా. మిడియం బాబురావు తీవ్రంగా విమర్శించారు. మండలంలోని చీమలవారిగూడెం గ్రామంలో శుక్రవారం ఆదివాసీ గిరిజన సంఘం నిర్వహించిన శిక్షణ తరగతులకు జిల్లా ఉపాధ్యక్షులు పోలోజు నాగేశ్వరావు ప్రిన్సిపాల్ గా వ్యవహరించారు. ఈ సందర్భంగా "ఆదివాసీ చట్టాలు-అమలు పాలకుల తీరు " అనే అంశం పై ఆదివాసీ హక్కుల కొరకు వివరించడం జరిగింది. ఈ మేరకు ఆదివాసీలకు అటవీ హక్కుల చట్టం (ఎఫ్ ఆర్ ఏ), పేసా చట్టం (పేసా) వంటి కీలక చట్టాలు ఆదివాసీల భూమి, జీవన హక్కులను రక్షించేందుకు రూపొందించినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం, పాలకుల సంకల్పలేమి వల్ల గ్రామ స్థాయిలో అమలు పూర్తిగా విఫలమైందన్నారు.
ఆదివాసీలు తరతరాలుగా సాగు చేస్తున్న భూములపై ఇంకా హక్కుల పత్రాలు ఇవ్వకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. ప్రభుత్వం వెంటనే ఆదివాసీ హక్కుల చట్టాలను కచ్చితంగా అమలు చేసి, పెండింగ్‌లో ఉన్న అటవీ హక్కుల దరఖాస్తులను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆదివాసీ సంఘాలు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.
అనంతరం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ. రవి మాట్లాడుతూ భూమి ప్రాధాన్యత, వ్యవసాయ కార్మికుల జీవన పరిస్థితులు, ఎదుర్కొంటున్న కష్టాలు అనే అంశాల పై వివరించడం జరిగింది . భూమి కేవలం ఆస్తి మాత్రమే కాదని ఆదివాసీ జీవనాధారం అని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు, ఉపాధి భద్రత, సామాజిక రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ,కోటరామచంద్రపురం పంచాయతీ సర్పంచ్ ఉయికే బొజ్జి దొర, జిల్లా నాయకులు కారం భాస్కర్, బొరగం భూచంద్రరావు, సుండ్రు బుల్లెమ్మ, కుర్సం భీమరాజు,గోకూరి పాండవులు,అన్నిక వెంకటస్వామి, పూనెం దుర్గారావు పాల్గొన్నారు.

# మండల భాజపా మహిళా మోర్చా అధ్యక్షురాలిగా పుట్టా వెంకటలక్ష్మి



విజేత దేవరపల్లి:
దేవరపల్లి మండల మహిళా మోర్చా అధ్యక్షురాలిగా సూర్యనారాయణపురం గ్రామానికి చెందిన పుట్టా వెంకటలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారుయర్నగూడెం గ్రామంలో మండల బీజేపీ అధ్యక్షులు కోలా రామకృష్ణ అధ్యక్షతన భాజపా మహిళా మోర్చా సమావేశం నిర్వహించారుసమావేశంలో పుట్టా వెంకటలక్ష్మి మండల మహిళా మోర్చా అధ్యక్షురాలిగా యాదవోలు గ్రామానికి చెందిన కోలా మాధవి యర్నగూడెం గ్రామానికి చెందిన అల్లంక మల్లిక జిల్లా మహిళా మోర్చా కార్యవర్గ సభ్యులుగా నియమించబడ్డారుసమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు పాలడుగు శ్రీవిద్య విశిష్ట అతిథులుగా రాష్ట్ర మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు విజయవాణి జోనల్ ఇంచార్జ్ శ్రీదేవి పాల్గొన్నారుకార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మండ జనార్ధనరావు జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి బొట్టా శ్రీరామకృష్ణ జిల్లా ఓబీసీ నాయకులు అల్లంక సత్యనారాయణ మండల ఉపాధ్యక్షులు పుట్టా హరిప్రసాద్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# జిటిజిహెచ్ రాజమహేంద్రవరం

**- హెచ్‌డిఎస్‌లో హెచ్‌డిఎస్ సభ్యుడిగా హరికృష్ణ**



విజేత బిదేవరపల్లి :
తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గం దేవరపల్లి మండలం దేవరపల్లి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గన్నమని హరికృష్ణ ను రాజమహేంద్రవరం హాస్పటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యుడిగా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేశారు. జి టి జి హచ్
రాజమహేంద్రవరం - హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యుడిగా గన్నమని హరికృష్ణ
నియమించిన ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు మరియు ఉపముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకట రాజు కి కృతజ్ఞతలు తెలియజేశారు.

# పేదల సొంతింటి కల సాకారంతో వారి గౌరవం, భద్రతకు ప్రభుత్వం మద్దతుగా నిలుస్తోంది : ప్రత్తిపాటి



విజేత గణపవరం
పేదల సొంతింటి కలను సాకారం చేయాలన్న గొప్ప లక్ష్యసాధనలో భాగంగా కూటమి ప్రభుత్వం గృహనిర్మాణ రంగానికి బడ్జెట్లో రూ.6,357 కోట్లు కేటాయించి, తమకంటూ ఒక మంచి ఇల్లు ఉండాలనుకునే పేదల భద్రత, గౌరవానికి మద్దతుగా నిలుస్తోందని, భవిష్యత్ పై వారి కుండే నమ్మకాన్ని నిజం చేస్తోందని ప్రత్తిపాటి వివరించారు. శుక్రవారం శాసనసభలో గృహనిర్మాణ రంగానికి నిధుల కేటాయింపులు : ప్రభుత్వ లక్ష్యం అనే అంశంపై జరిగిన చర్చలో మాజీమంత్రి ప్రసంగించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన - 2.0లో భాగంగా దేశవ్యాప్తంగా 2కోట్ల ఇళ్లనిర్మాణం కేంద్రప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంటే, ఎన్టీఆర్ గృహనిర్మాణపథకం : అందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఏపీలోని కూటమిప్రభుత్వం 2024- 25 నుంచి, 2028-29 వరకు 17,63,761 గృహాలు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. పేదల కలను సాకారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం గొప్ప బాధ్యతతో ముందుకు వెళతోంది అనడానికి ఇదే నిదర్శనమని ప్రత్తిపాటి చెప్పారు.
షీర్ వాల్ టెక్నాలజీతో కట్టినందునే నేటికీ టిడ్కో ఇళు చెక్కుచెదరలేదు చిలకలూరిపేటలో 4512 టిడ్కో గృహాలు పూర్తయితే 3వేల ఇళ్లలో నివాసముంటున్నారు.
2014-19 మధ్య నాటి టీడీపీ ప్రభుత్వం 2,04,600 ఇళ్లను యుద్ధప్రాదిపతికన షీర్ వాల్ పరిజ్ఞానంతో నిర్మించిందని, గత ప్రభుత్వం ఆ ఇళ్లను పూర్తిగా గాలికి వదిలేసినా, నేటికీ అవి చెక్కుచెదరకుండా ఉన్నాయంటే చంద్రబాబు తీసుకొచ్చిన సరికొత్త నిర్మాణ పరిజ్ఞానమే కారణమని ప్రత్తిపాటి తెలిపారు. ఆనాడు ఎలక్ట్రానిక్ డ్రా పద్ధతిలో ఇళ్లను కేటాయిస్తే, గత ప్రభుత్వం ఇష్టానుసారం అనర్హులకు కూడా ఇళ్లు కేటాయించిందన్నారు. చిలకలూరిపేటలో అప్పటి మంత్రి నారాయణ సహకారంతో 4,512 ఇళ్లను డ్రా తీసి లబ్ధిదారులకు కేటాయించడం జరిగిందన్నారు. కూటమిప్రభుత్వం వచ్చాకే ఆ ఇళ్లన్నీ సకల హంగులతో పూర్తిచేసి 3వేల ఇళ్లలో కుటుంబాలు నివాసముండేలా చేయడం జరిగిందన్నారు. మరో 1008 గృహాల్లో చిన్నచిన్న నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. మొత్తం 5520 ఇళ్లన్నీ కుటుంబాలతో నిండిపోతే, అక్కడే దాదాపు 20వేల మంది నివాసముంటారని ప్రత్తిపాటి తెలిపారు.
టిడ్కో గృహ సముదాయాల్లో సకల వసతులు కల్పిస్తేనే నివాసానికి ప్రజలు ఇష్టపడతారు
టిడ్కో గృహాల్లో ఉండటానికి ఇళ్లు పొందినవారు ఆసక్తిగానే ఉన్నారని, కానీ అక్కడ వారికి అవసరమైన వివిధ రకాల మౌలికవసతులు కల్పించాలని కోరుతున్నారని ప్రత్తిపాటి చెప్పారు. విద్య, వైద్య భవనాలు. ప్రార్థనామందిరాలు, దుకాణ సముదాయాలు, కుల చేతి వృత్తుల వారికి అవసరమైన వసతులు, కళ్యాణమండపాలు, కమ్యూనిటీ హాళ్లు, శ్మశానం వంటి వాటిపై ప్రజల నుంచి అభ్యర్థనలు వస్తున్నట్టు ప్రత్తిపాటి ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. ఈ ఏర్పాట్లు పూర్తయితే ముఖ్యమంత్రి అనుకున్న విధంగా టిడ్కో సముదాయాలు మరో మినీ పట్టణాలను తలపిస్తాయని ప్రత్తిపాటి పేర్కొన్నారు. వేలకోట్లు ఖర్చు పెట్టి నిర్మించిన ఇళ్లు పాడైపోకుండా ఉండాలంటే ప్రభుత్వం వెంటనే మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. అదే విధంగా బహుళ అంతస్తుల భవనాలుగా నిర్మించిన టిడ్కో గృహాల్లో లిఫ్టుల సౌకర్యం కూడా ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు.
2014-19లో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి
పీఎంఏవై గ్రామీణ్ పథకం కింద గృహనిర్మాణ నిమిత్తం రూ.2.39 లక్షలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లబ్ధిదారులకు అందిస్తున్నాయని, దానిలో బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు, రూ.లక్ష వరకు రాయితీ ఇస్తున్నామని, దానిలో జరిగే జాప్యాన్ని ప్రభుత్వం తక్షణమే తొలగించాలని ప్రత్తిపాటి కోరారు. 2014-19లో మొదలుపెట్టిన కొన్ని గృహాలు ఇప్పటికీ అసంపూర్ణంగా ఉన్నాయని, ప్రతినియోజకవర్గంలో ఈ సమస్య ఉందని, చాలాచోట్ల ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణదశలోనే నిలిచిపోయాయని ప్రత్తిపాటి తెలిపారు. ఈ తరహా నిర్మాణాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సి ఉందన్నారు. 2019-24 మధ్యకాలంలో చేపట్టిన గృహ నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారులకు బిల్లులు అందుతున్నాయని, 2014-19 మధ్యకాలం నాటి నిర్మాణాల విషయమే ప్రశ్నార్థకంగా మారినందున ప్రభుత్వం తక్షణమే సమస్యపై స్పందించాలన్నారు.
గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల ఇంటిస్థలాలు ఇవ్వాలన్న నిర్ణయానికి తిరుగులేదు
ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ ప్రభుత్వాన్ని పేదలు జీవితాంతం గుర్తుంచుకునేలా సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని ప్రత్తిపాటి తెలిపారు. ఇంటిస్థలాలు లేని గ్రామాల్లోని పేదలకు ఉచితంగా 3 సెంట్లు, పట్టణాల్లోని వారికి 2 సెంట్లు ప్రభుత్వమే అందిస్తుందన్న నిర్ణయం తిరుగులేనిదని ప్రత్తిపాటి కొనియాడారు. ఇళ్ల స్థలాలు కావాలంటూ ఇప్పటికే ప్రజల నుంచి దరఖాస్తులు వస్తున్నాయన్నారు. దేశంలో మరే రాష్ట్రంలో ఈ తరహా ఆలోచన ఏ ప్రభుత్వం చేయలేదన్నారు. ఈ ప్రభుత్వం అందించే ఇళ్ల స్థలాల్లో ముందుగానే రోడ్లు, డ్రైనేజ్ లు, విద్యుత్ సౌకర్యం వంటి వసతులు కల్పించాకే పేదలకు స్థలాలు ఇస్తే బాగుంటుందని ప్రత్తిపాటి సూచించారు.
సెంటు పట్టాలు, ఇళ్ల స్థలాల పేరుతో జరిగిన అవినీతిపై ప్రత్యేక విచారణ కమిటీ వేయాలి
చిలకలూరిపేటలో భూ యజమానుల నుంచి ముందే రూ.3 నుంచి రూ.10లక్షలు వసూలు చేశారు.
గత ప్రభుత్వం నివాసానికి పనికిరాని భూములను పేదలకు ఇళ్లస్థలాలుగా ఇచ్చి, వారిని మోసగించిందని, రాష్ట్రంలో ఆనాడు ఇచ్చిన సెంటుపట్టాల్లో చాలావరకు నిరుపయోగంగానే ఉన్నాయని ప్రత్తిపాటి సభకు తెలియచేశారు. చిలకలూరిపేటలో గతపాలకులు ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో జరిగిన అవినీతిపై సొంతపార్టీవారే కోర్టులకు వెళ్లారన్నారు. కేవలం ఇళ్లస్థలాల కోసమే 251 ఎకరాల భూమి కొన్నారని, దానిలో భాగంగా ప్రభుత్వం నుంచి అధికధర ఇప్పిస్తామని భూయజమానుల్ని మోసగించి, వారినుంచి ముందే రూ.3 నుంచి రూ.10 లక్షల వరకు చెక్కులు తీసుకొని గత ప్రజాప్రతినిధి, మాజీఅవినీతి మంత్రి భారీ దోపిడీకి పాల్పడ్డారని ప్రత్తిపాటి తెలియ చేశారు. ఈ విధంగా ప్రతి నియోజకవర్గంలో పెద్దఎత్తున అవినీతి జరిగిందన్నారు. చిలకలూరిపేటలో జరిగిన అవినీతిపై మాజీమంత్రి విడదల రజినీ దోపిడీనీ నిరసిస్తూ సొంతపార్టీ వారే కోర్టులను ఆశ్రయించడంతో తీసుకున్న సొమ్ము వెనక్కు ఇచ్చారని ప్రత్తిపాటి చెప్పారు. వినుకొండలోనూ ఇదేవిధంగా జరిగిందన్నారు. ఈ వ్యవహారంపై కూటమిప్రభుత్వం వెంటనే ప్రత్యేక విచారణ జరిపించాలని, అందుకోసం విచారణా కమిటీని ఏర్పాటు చేయాలని ప్రత్తిపాటి సభాముఖంగా కోరారు. ఇళ్ల స్థలాల పేరిట గత ప్రభుత్వం చేసిన భారీ దోపిడీని ప్రజల ముందు ఉంచి, అవినీతిపరుల్ని శిక్షిస్తేనే ప్రజలకు ప్రభుత్వంపై ఉన్న నమ్మకం మరింత బలపడుతుందన్నారు.

**పల్నాడు జిల్లా (నరసరావుపేట పార్లమెంటు) సెగ్మెంట్ల ప్రజాప్రతినిధులతో ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేష్ ఏర్పాటు చేసిన ఆత్మీయ విందులో కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొనడం ఆనందంగా ఉంది. ౦**

**మాజీమంత్రివర్యులు ప్రత్తిపాటి పుల్లారావు.**





విజేత ఉండవల్లి
లోకేష్ మా కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకోవడం ఎంతో సంతోషాన్ని కలిగించింది. మేము అందజేసిన పలు వినతులపై స్టేటస్ రిపోర్ట్ అందజేయడం ఆయన కార్యదక్షతకు నిదర్శనం. ఆడపడుచులకు మంగళగిరి పట్టుచీరలతో గౌరవం అందించి, మాతో కలిసి భోజనం చేసిన నారా లోకేష్ ఆత్మీయత మరువలేనిది.

# సమస్యలతో సతమతమవుతున్న మున్సిపల్ 18 వ వార్డు ఎన్టీఆర్ నగర్ కాలనీ వాసులు

**- అధికారులు స్పందించరా!!**



రేపల్లె 27..2.26 రేపల్లె మున్సిపాలిటీ పరిధిలోని 18 వార్డులో నాలుగు సంవత్సరాల క్రితం ఏర్పాటు అయిన నాటి జగనన్న కాలనీ నేడు ఎన్టీఆర్ నగర్ కాలనీ పేరుతో ఏర్పడినప్పటికీ కాలనీలో గృహ యజమానులు పడుతున్న అవస్థలు అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు మున్సిపల్ అధికారులకు ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు కాలనీలో మౌలిక వసతులు లేక నానా అవస్థలు పడుతున్నామని సరైన రోడ్డు సౌకర్యం లేక లైట్లు వెలగకపోవడం సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక ఇళ్ల వద్ద వాడుకున్న నీరు వాకిట్లో ముందు నే నిలిచిపోయి ఉండటంతో దోమలు పెరిగిపోయి రోగాల పాలవుతున్నామని కాలనీవాసులు శు క్రవారం మున్సిపల్ కమిషనర్ కే సాంబశివరావుకు వినతిపత్రం ద్వారా తెలియజేశారు కాలనీలో రోడ్డు సౌకర్యం మంచినీరు మురుగునీరు వీధిలైట్లు సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు